# హుల్దా జీవితం నుండి ఆత్మీయ పాఠాలు

## 1. హుల్దా పుట్టుపూర్వోత్తరాలు

హుల్దా అనగా 'పుట్టుమచ్చ అని అర్థము.' ఈమె ఒక ప్రవక్తిని ధర్మశాస్త్ర గ్రంధాన్ని కనుగొన్న తరువాత క్రీ.పూ. 621 సం||లో యోషియా రాజు తరపును ఈమెను సంప్రదించినట్లు చూడగలము. 2 రాజులు 22:14ను బట్టి ఈమె షల్లూముకు భార్యయని తెలియుచున్నది. మరియు ఈమె యిర్మీయా జెఫన్యాలకు సమకాలికురాలు. ఈమె భర్తయగు షల్లూము హర్హషుకుపుట్టిన తిక్వాకు యొక్క కుమారుడు. క్రీ.పూ. 639 - 609 వరకుపరిపాలించిన యోషీయా అను రాజు నొద్ద షల్లూము వస్త్రశాలకు అధికారిగా రాజదర్బారు సభ్యుడై పనిచేయుచుండెను. వీరిరువురు యెరూషలేములోని రెండవ భాగమందు కాపురస్థులుగానున్నట్లు చూడగలము. మత సంస్కరణములకు పిలుపునిచ్చి, రాజును రాజపరివారాన్ని, యూదా ప్రజలందరిని దేవుని వైపు త్రిప్పి, సాతాను రాజ్యాన్ని పడగొట్టిన గొప్ప ప్రవక్తినిగా, దైవజనురాలిగా హుల్దా చరిత్రలో గొప్ప పేరు ప్రఖ్యాతులను గడించినది. తనభక్తి జీవితంలో ఒక రాజ్యాన్ని దేవునివైపు మళ్లించిన హుల్దా జీవితంలో అనేక ఆత్మీయ సత్యాలను తెలిసికొనవచ్చును.

## 2. హుల్దా ఒక ప్రవక్తిని గొప్ప భక్తిపరురాలు

హుల్దా అతిసామాన్యమైన స్త్రీయే ఐనప్పటికీ దేవుని ఎరిగిన స్త్రీ. దేవునితో నిత్యసాంగత్యము కలిగి, దేవుని ఆత్మను పొంది, దేవుని మాటలను, ఆయన తలంపులను దైవావేశంచేత ప్రజలకు తెలియచేసే ప్రవక్తినిగా, గొప్ప భక్తిపరురాలిగా స్థిరపడినది. ఈ హుల్దా యోషియా రాజుకాలంలో ప్రవక్తినిగాస్థిరపడినట్లు చూడగలము. ఈ రాజుకు ముందున్న రాజుల పరిపాలనా కాలాన్ని అంటే తండ్రి ఆమోను తాత మనష్షేలకాలం దుష్టకాలము. దేవునికి వ్యతిరేకంగా గడిపిన కాలము. ఆ దుష్ట పరిపాలనను మనము 2 రాజులు 21వ అధ్యాయములో చూడగలము. ఆ దినాలన్ని నిరపరాధుల రక్తం ఒలికించబడిన దినాలుగా పేర్కొనబడ్డాయి. అటువంటి దినాలలోనే హుల్దా తన భక్తి జీవితానికి గట్టి పునాది వేసికుని ప్రవక్తిని స్థిరపడినదంటే ఆమెలోని భక్తిలో గల శక్తి అసమానమైనదిగా పేర్కొనవచ్చును. కాగా 2 తిమోతి 3:5లో 'పైకి భక్తి గలవారి వలె ఉండియు దాని శక్తిని ఆశ్రయించని వారునై యుందురు. అని పేర్కొనబడినది. అయితే ఈ హుల్దా పరిస్థితులు అనుకూలించని సమయంలో కూడా భక్తి జీవితాన్ని కట్టుకొని ప్రవక్తినిగా స్థిరపడినది. హుల్దా భక్తి జీవితాన్ని చూస్తూ ఉన్న మనము మన ఆత్మీయ జీవితాన్ని ఎలాకట్టుకుంటున్నాము? దేవునికి పనిముట్టుగా ఉపయోగపడే భక్తి జీవితాన్ని మనం కలిగియున్నామా? అని మనలను మనము పరిశీలించుకోవలసిన వారమైయున్నాము.

## 3. హుల్దా గొప్పధైర్యవంతురాలు

సామెతలు 31:31లో యెహోవాయందు భయభక్తులు కల్గిన స్త్రీ కొనియాడబడును అని వ్రాయబడినది. సామెతలు 14:26లో యెహోవా యందుభయభక్తులు కలిగియుండుట బహుధైర్యము పుట్టించును అని వ్రాయబడినది. దేవుని యందు భయభక్తులు కలిగియుండుట వలన మనము జీవమును ధైర్యమును, క్షేమమును, ఘనతను, జ్ఞానమును, వివేకమును, ఐశ్వర్యమును మొదలైన అనేక దీవెనలను పొందగలమని కీర్తనా కారుడైన దావీదు సెలవిచ్చుచున్నాడు. ఎందుకనగా మన ప్రభువు మృతిని జయించిన మృత్యుంజయుడు సాతానును జయించిన శక్తిమంతుడు. నిత్యజీవము నిచ్చే నిజరక్షకుడు, లోకాన్ని, సాతానును మరణాన్ని, సృష్టిని జయించిన జయవీరుడు, జయశూరుడు, జయశీలుడు.

యాజకుడైన హిల్కియాయును, అహీకామును, అక్బోరును షాఫాను, ఆశాయును ప్రవక్తియగు హుల్దా యొద్దకు వచ్చినపుడు హుల్దా దేవుని మాటలను ధైర్యంతో వారికిలా తెలియచేయుచున్నది. 2 రాజులు 22:15-18 'హుల్దా వారితో ఇట్లనెను - మిమ్మును నాయొద్దకుపంపిన వారితో ఈ మాట తెలియచెప్పుడి. ఏదియు విడిచి పెట్టకుండా కీడంతటిని రప్పించెదనని యెహోవా సెలవిచ్చుచున్నాడని యూదా రాజుతో చెప్పుడని' ఆ మనుష్యులకు తెలియచేస్తున్నది. హుల్దా ధైర్యవంతురాలు కాబట్టి భయపడక రాజునకు కలుగబోయే కీడును గూర్చి తెలియపరచినది.

రాజు గారు తన నేమి చేస్తారో ఇవి మంచి మాటలు కాదు గదా! రాజు క్షేమాన్ని గురించి కాదు గదా! తనకు అపాయం వాటిల్లుతుందేమో! రాజు తనను శిక్షిస్తాడేమోనని ఏ మాత్రము భయపడలేదు. ధైర్యంగా నిలబడి దేవుని పక్షంగా మాట్లాడుచున్నది. మనుష్యుల మెప్పును, రాజు మెప్పును పొందుటానికి ఆత్రుత పడకుండా దేవుని మాటలను ఉన్నవి ఉన్నట్లుగా ప్రకటించుచున్నది. సామెతలు 'తన పనిలో నిపుణత గల వానిని చూచితివా? వాడు రాజు ఎదుటనే నిలబడగలడు? అనునట్లే హుల్దా రాజునకు భయపడలేదు. తన దేవుని కొరకు నిలబడి, దేవుని మాటలను నిర్భయంగా ప్రకటించుచున్నది.

కీర్తనలు 68:11లో 'ప్రభువు మాటసెలవిచ్చుచున్నాడు. దానిని ప్రకటించు స్త్రీలు గొప్పసైన్యముగానున్నారు. అన్నట్లుగా, దేవునిమాటలను ప్రకటించే సైన్యములో హుల్దా ఒక గొప్ప సైనికురాలిగా పోరాడుచున్నది.

దేవుని పక్షంగా నిలబడి మాట్లాడినపుడు ఇంటా, బయటా ఎన్నో శ్రమలు ఎదురౌతాయి. ఎంత ధైర్యం, మాటల చాతుర్యం ఉన్నప్పటికీ ఎదుటివారి తప్పును ఖండించినపుడు ముఖ్యంగా రాజుగారి తప్పును ఎత్తి చూపడం వలన అనేక శ్రమలు, ఇబ్బందులు ఎదురౌతాయి. అయినప్పటికీ హుల్దా వాటిని లక్ష్యపెట్టలేదు. ప్రభువు మార్గమును సరాళము చేయుచూ, పాపమును ధైర్యముగా ఖండించుచున్న ప్రవక్తయైన యోహాను రాజునకు సైతం భయపడకుండా హేరోదియ పాపమును ఖండించటంతో దేవుని పక్షంగా మాట్లాడినందుకు తల నరికివేయబడి యోహాను చంపబడ్డాడు. దేవుని పక్షంగా మాటలాడినందుకు స్తెఫను రాళ్లతో కొట్టి చంపబడ్డాడు. అయినప్పటికీ హుల్దా దేవుని చిత్తాన్ని బట్టి యూదావారికి రాబోయే కీడంతటినీ దేవుడు చేయబోయే కార్యాన్ని గూర్చి ఆ వచ్చిన పెద్దలతో చెప్పడమే గాక,

ఆ కీడు రాకుండా ఉండటానికి యూదారాజు, ప్రజలు ఏమి చేయాలో అనే విషయాన్ని కూడా హుల్దా దేవుని మాటలుగా, దేవుని పక్షంగా నిలబడి, వారికి తెలియచేసింది.

## 4.రాజును,రాజ పరివారాన్ని,యూదా ప్రజలను దేవునివైపు మళ్లించిన స్త్రీ

దేవుని నుండి ఉగ్రతకు గురికాకుండా తప్పించుకొనడానికై యూదారాజు, రాజ పరివారము యూదాప్రజలు దేవునివైపు మరలి, దేవుని దయకు పాత్రులవడానికై ఏమిచేయాలో అనే విషయాన్ని కూడా హుల్దా దేవుని మాటలుగా, దేవుని పక్షంగా నిలబడి, వారికి తెలియచేసింది. 2 రాజులు 22:19లో 'ఇశ్రాయేలీయుల దేవుడైన యెహోవా సెలవిచ్చునదేమనగా : ఈ స్థలము పాడగుననియు, దాని కాపురస్థులు దూషణ పాలగుదురనియు నేను చెప్పి మాటలను నీవు ఆలకించి, మెత్తని మనస్సు కలిగి, యెహోవా సన్నిధిని దీనత్వము ధరించి, నీ బట్టలు చింపుకుని, నా సన్నిధిని కన్నీళ్లు రాల్చితివి గనుక నీవు చేయమనవిని నేను అంగీకరించియున్నాను. ఈ కీడును నీవు నీ కన్నులతో చూడనే చూడవు. ఇదే యెహోవా వాక్కు యెషయా 66:2లో ఎవడు దీనుడై నలిగిన హృదయము గలవాడై నామాట విని వణకుచుండునో వానినే నేను దృష్టించుచున్నాను. అన్నట్లుగా హుల్దా జీవితంలోని ఉజ్జీవం ద్వారా దేవుని మాటలను తెలియచేసినది. ఈ మాటల ద్వారా యోషియా తన మనస్సు మార్చుకుని దీనత్వము కలిగి, దేవునివైపు తిరగటానికి దోహదం చేసాయి. హుల్దాలోని ఈ గొప్ప ఉజ్జీవము ద్వారా దేవుని మాటలను యూదారాజునకు ఆ పెద్దలు రాజునొద్దకు తెచ్చిరి.

## 5. రాజ్యమంతటా మతసంస్కరణలకు పిలుపునిచ్చిన స్త్రీ

2 రాజులు 23:1 - 3 అప్పుడు రాజు యూదా పెద్దలనందరిని పిలిచి - పూర్ణ హృదయముతో ఈ నిబంధన గ్రంథమందు వ్రాయబడియున్న మాటలన్నిటిని స్థిరపరచుదునని యెహోవా సన్నిధిని నిబంధన చేయగా జనులందరును ఆ నిబంధనకు సమ్మతించిరి. అందువలన హుల్దా చెప్పిన మాటలను బట్టి ఆ రాజు అనేక మత సంస్కరణములకు పిలుపు నిచ్చెను. 23వ అధ్యాయమును బట్టి రాజు బయలు దేవత, ఆషేరా దేవతలను కాల్చివేసెను. అర్చకులను, దూపము వేయువారిని నిలిపివేసెను. ఆషేరా దేవి ప్రతిమను కిద్రోనువాగు దగ్గర కాల్చి త్రొక్కి పొడుముచేసెను. మరియు మొలెకునకు అగ్ని గుండము దాటే ప్రదేశములను అపవిత్రము చేసెను. సూర్యునికి ప్రతిష్ఠించిన రథములను అగ్నితో కాల్చివేసెను. అంతేగాక బలిపీఠములను పడగొట్టించెను. మరియు ఇశ్రాయేలు రాజులు షోమ్రోను పట్టణములో ఏ ఉన్నత స్థలములో మందిరములను కట్టించి, యెహోవాకు కోపము పుట్టించినారో ఆ మందిరములన్నిటిని యోషీయా తీసివేసి దేవతారాధన చేసిన యాజకులను బలిపీఠముల మీద చంపించి, కాల్పించి యెరూషలేమునకు తిరిగి వచ్చెను.

## 6 .సాతాను రాజ్యాన్ని పడగొట్టించిన స్త్రీ

2 రాజులు 23: 21-24లో అంతట నిబంధన గ్రంథమందు వ్రాసిన విధముగా జనులందరికీ ఆజ్ఞాపించి, పస్కా పండుగను ఎన్నడును జరుగనంత గొప్పగా ఆచరించెను. గ్రంథమందు వ్రాసియున్న ధర్మశాస్త్ర విధులను స్థిరపరచుటకై ప్రయత్నం చేసి రాజు, రాజ పరివారము, ప్రజలందరును ధర్మశాస్త్ర విధులను ఆచరించినారు.

2 రాజులు 23:25లో అతనికి పూర్వమున్న రాజులలో అతనివలె పూర్ణ హృదయముతోను, పూర్ణాత్మతోను, పూర్ణబలముతోను యెహోవా వైపు తిరిగి మోషే నియమించిన ధర్మశాస్త్రము చొప్పున చేసినవాడు ఒకడును లేడు. అతని తరువాతనైనను అతనివంటివాడు ఒకడును లేడు. హుల్దా తనలోని ఉజ్జీవము ద్వారా సాతాను రాజ్యాన్ని పడగొట్టించి దేవునిరాజ్యాన్ని ఆ రాజ్యములో నెలకొల్పిన ఘనురాలుగా ప్రసిద్ధిచెందినది.

## 7. యూదా రాజ్యాన్ని దేవునివైపు మళ్లించిన స్త్రీ

2రాజులు 23:24 మరియు కర్ణపిశాచి గలవారిని సోదెచెప్పువారిని గృహ దేవతలను విగ్రహ ములను, యూదాదేశమందును యెరూషలేమునందును కనబడిన విగ్రహములన్నిటిని యోషీయా తీసివేసి, యెహోవామందిరమందు యాజకుడైన హిల్కీయాకు దొరికిన గ్రంథమందు వ్రాసియున్న ధర్మశాస్త్ర విధులను స్థిరపరచుటకై ప్రయత్నము చేసెను. 2రాజులు 23:25అతనికి పూర్వమున్న రాజులలో అతనివలె పూర్ణహృదయముతోను పూర్ణాత్మతోను పూర్ణబలముతోను యెహోవావైపు తిరిగి మోషే నియమించిన ధర్మశాస్త్రముచొప్పున చేసినవాడు ఒకడును లేడు; అతని తరువాతనైనను అతనివంటివాడు ఒకడును లేడు.

హుల్దా మాటలవలన యోషయా తన మనస్సు మార్చుకుని దీనత్వము కలిగి దేవుని సన్నిధిలో కన్నీరు కార్చి తన జీవితాన్నే గాక యూదా రాజ్యాన్నంతటిని దేవునివైపు మరల్చుటకు, ధర్మశాస్త్ర విధులను స్థిరపరచుకొనుటకు హుల్దా దేవుని పక్షాన నిలబడి చేసిన హెచ్చరికలు దోహదము చేసినది. హుల్దా చివరకు యూదా రాజ్యాన్ని కదిలించింది. యూదా రాజ్యాన్ని దేవునివైపు మళ్లించింది. రాజునేగాక, రాజపరివారాన్ని, యూదారాజ్యమంతటిని దేవునివైపు మళ్లించిన హుల్దా జీవితం మనందరకు ఆదర్శం. మన జీవితాలెలా ఉన్నాయి? మనుష్యులను దేవునివైపు మరలించువారమైయున్నామా? లేక సాతానువైపు మరలించు వారమైయున్నామా? మనలను మనం పరిశీలించుకొందముగాక!